


బర్త్‌డే సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్‌కు పూలబొకే అందజేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి



తెలంగాణ భవన్‌లో.. బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో రక్తదానం చేస్తున్న మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం పెద్దముప్పారం గ్రామానికి చెందిన యువత



కేటీఆర్‌కు పూల బొకే అందజేస్తున్న ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, బండారి లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేశ్, బీఆర్ఎస్ నేత రాగిడి లక్ష్మారెడ్డి



# ఘనంగా కేటీఆర్ బర్త్‌డే

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ పుట్టిన రోజు వేడుకలు బుధవారం గ్రేటర్ వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, పార్టీ శ్రేణులు, కేటీఆర్ అభిమానులు ఆయా ప్రాంతాల్లో బర్త్‌డే కేక్‌కట్ చేసి సంబురాలు చేశారు. పలుచోట్ల రక్తదానం, అన్నదానం, చీరల పంపిణీ, రోగులకు పండ్లు పంపిణీ, ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ పరిధి భాగ్యశ్రీగార్డెన్‌లో కేటీఆర్ పుట్టినరోజును పురస్కరించుకొని స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ కేక్‌కట్ చేసి సుమారు 2000 మంది నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శంభీపూర్‌రాజు శంభీపూర్‌లోని తన కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఇతర నాయకులు ఆయా నియోజకవర్గంలో పెద్దఎత్తున కార్యక్రమాలు చేపట్టారు.**

– సిటీబ్యూరో, జూలై 24(నమస్తే తెలంగాణ)



ఉప్పల్ : ఉప్పల్ డివిజన్‌లోని భరత్‌నగర్‌లో బుధవారం ఎమ్మెల్యే కేటీఆర్ పుట్టిన రోజు సందర్భంగా సరస్వతీ శిశు మందిర్ విద్యార్థులకు పిల్లి నాగరాజు చేతులమీదుగా స్కూల్ యునిఫామ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేకల హనుమంతారెడ్డి, గోనె అర్జున్‌రెడ్డి, ఎం.అంజిరెడ్డి, మంచికంటి రాజు, వర్ధన్, మించ కృష్ణ, రంగ భాస్కర్‌గౌడ్, కాయ హనుమంత్, శివ, సలీం, బూడిద జాంగీర్ గౌడ్, అల్లాభాష, అరటికాయల శ్రీనివాస్, ఎం.హరి, ఎం.జానార్దన్, యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




ఓయూలో మొక్కలు నాటుతున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్, బీఆర్ఎస్వీ నాయకులు



ఎమ్మెల్యే కేటీఆర్‌కు మొక్కను అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ నేత ముఠా జైసింహ

**బీఆర్ఎస్ భవన్‌లో రక్తదానం చేస్తున్న వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య**



మణికొండ మున్సిపాలిటీలో బుధవారం రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ నాయకులు పట్లోళ్ల కార్తిక్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్‌కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దూళిపాళ్ల సీతారాం, కుంభగళ ధన్‌రాజ్, ఉపేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

**- మణికొండ,జూలై 24**

## 30 నుంచి దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక మహాసభలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరికలెక్టరేట్, జూలై 24 : ఈ నెల 30, 31తేదీల్లో రామన్నపేట మండల కేంద్రంలో దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక మూడో మహాసభలను నిర్వహించనున్నట్లు ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు సురుపంగా ప్రకాశ్, ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్ తెలిపారు. మహాసభలకు సంబంధించిన కరపత్రాలను బుధవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ హనుమంతు కె. జెండగే చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామన్నపేటలోని జేపీ ఫంక్షన్‌హాల్లో జరిగే మహాసభలకు దివ్యాంగులు అధిక సంఖ్యలో రావాలని కోరారు. కార్యక్రమంలో మహిళా విభాగం జిల్లా కన్వీనర్ కొత్త లలిత, అంజన్‌శ్రీ, పి. గోపి పాల్గొన్నారు.

## రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

- **సీఐటీయూ మండల కన్వీనర్ శ్రీనివాస్**

బీబీనగర్, జూలై 24 : ఈ నెల 27, 28 తేదీల్లో రామన్నపేట పట్టణ కేంద్రంలో జరిగే సీఐటీయూ రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సంఘం మండల కన్వీనర్ గాడి శ్రీనివాస్ కోరారు. బుధవారం బీబీనగర్‌లోని బ్రాహ్మణపల్లి చౌరస్తా వద్ద రాజకీయ శిక్షణ తరగతుల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో కార్మికవర్గం అనేక సమస్యలను ఎదుర్కొంటున్నదన్నారు. పోరాడి సాధించుకున్న 29 చట్టాలను కేంద్రం ప్రభుత్వం 4 లేబర్ కోడ్లుగా మార్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో పరిశ్రమలు ఉన్నప్పటికీ స్థానికులకు ఉపాధి లభించడం లేదన్నారు. అన్ని అంశాలపై శిక్షణ తరగతుల్లో చర్చించేనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బండారు శ్రీరాములు, దండబోయిన శ్రీశైలం, సయ్యద్ జలీల్, గోలన్‌కొండ అంజయ్య, ఓవల్దాస్ మురళి, మూడవత్ కీమానాయక్ పాల్గొన్నారు.

## యాదగిరిగుట్ట దేవస్థానంలో ఎస్పీఎఫ్ సిబ్బంది బదిలీ

యాదగిరిగుట్ట, జూలై 24: యాదగిరిగుట్ట దేవస్థానంలో పని చేస్తున్న ఆరుగురు ఎస్పీఎఫ్ సిబ్బంది బదిలీ అయ్యారు. నాలుగేండ్లుగా కొండపైన విధులను నిర్వర్తించే ఎస్పీఎఫ్ సిబ్బందికి సాధారణ బదిలీలు నిర్వహిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దేవస్థాన ఎస్పీఎఫ్ ఏఎస్‌ఐ డి.రాజును బేగంపేట ఎయిర్‌పోర్టుకు, హెడ్ కానిస్టేబుల్ పి. సురేశ్‌బాబును వరంగల్‌లోని యూబీఐసీసీకు, ఆర్. మహేందర్‌ను ఆర్‌బీఐకి, వి. రామకృష్ణను సెక్రటేరియట్‌కు, కె.వెంకటయ్యను అసెంబ్లీకి, యాకయ్యను నాగార్జునసాగర్ టీఎస్ జెన్‌కోకు బదిలీ చేశారు. వీరిస్థానంలో బీఆర్‌కే భవన్ నుంచి ఏఎస్‌ఐ వి. నాగేశ్వర్‌రావు, వరంగల్‌లోని యూబీఐసీసీ నుంచి హెడ్ కానిస్టేబుల్ కె. శ్రీనాథ్, ఎస్‌పీపీ నుంచి హెడ్ కానిస్టేబుల్ కేపీ. చంద్రశేఖర్, అసెంబ్లీ నుంచి హెడ్ కానిస్టేబుల్ వై. రమేశ్, సెక్రటేరియట్ నుంచి హెడ్ కానిస్టేబుల్ టి. మోహన్‌రెడ్డి, హై కోర్టు నుంచి హెడ్ కానిస్టేబుల్ ఆర్. రామ్మోహన్‌రావు దేవస్థానానికి రానున్నారు. వీనే నేడు బాధ్యతలు స్వీకరించనున్నారు.

## భువనగిరి ఎంపీఓగా దినకర్‌గౌడ్

భువనగిరి కలెక్టరేట్, జూలై24: భువనగిరి మండల పంచాయతీ అధికారిగా ఎం. దినకర్‌గౌడ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఎంపీఓగా పనిచేసిన అనూరాధాదేవి బదిలీపై వెళ్లగా రాజాపేట నుంచి దినకర్‌గౌడ్ ఇక్కడికి వచ్చారు. ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాస్‌రావు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## నేడు ముత్తిరెడ్డిగూడెంలో రైతులకు శిక్షణ

భువనగిరి కలెక్టరేట్, జూలై 24: హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని జాతీయ మొక్కల ఆరోగ్య నిర్వహణ విభాగం, జిల్లా ఏరువాక కేంద్రం, వ్యవసాయశాఖ సంయుక్తంగా గురువారం మండలంలోని ముత్తిరెడ్డిగూడెం రైతువేదికలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ బి.అనిల్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసే గిడ్డంగులు, నిల్వ ధాన్యంపై రుణాలు అనే అంశంపై నిర్వహించే శిక్షణ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సహాయ సంచాలకురాలు పి.జ్యోతి, ఏరువాక శాస్త్రవేత్త కె.మమత ప్రస్తుత పంటల సాగు, ధాన్యం నిల్వల్లో మెళకువలపై శిక్షణ, రైతుల సందేహాలను నివృత్తి చేయనున్నట్లు వెల్లడించారు. అనంతరం భువనగిరి గంజ్‌లోని గిడ్డంగుల సందర్శన, అవగాహన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. శిక్షణ అనంతరం రైతులకు భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

## రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలి

రామన్నపేట, జూలై 24: రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసర్చ్ సంస్థ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ మంగల్‌దీప్ టుటీ సూచించారు. బుధవారం మండలంలోని కక్కిరేణి గ్రామంలో సేవాస్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టేట్‌బ్యాంక్‌ఆఫ్ ఇండియా సీఎస్‌ఆర్ ఫౌండేషన్ సాయంతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వెదజల్లే పద్ధతిలో గ్రామంలో 300 ఎకరాల్లో వరి సాగు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, రైతులు, పాల్గొన్నారు.

# డబుల్ బెడ్రూం ఇండ్లు కబ్జా

### పోలీసు, రెవెన్యూ, హౌసింగ్ అధికారుల దాడులు.. పది ఇండ్లు స్వాధీనం



ఇండ్లకు సీల్ వేస్తున్న అధికారులు

ఖైరతాబాద్, జూలై 24: ఖైరతాబాద్ ఇందిరానగర్‌లో కట్టిన డబుల్ బెడ్రూం ఇండ్లను కొందరు కబ్జా చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇందిరానగర్ కాలనీలో సిల్ట్+5 అంతస్తులతో, నాలుగు బ్లాకులు, 37 లిఫ్టులు, 12 షాపింగ్ కాంప్లెక్స్‌లతో అట్టహాసంగా నిర్మించారు. అన్ని బ్లాకులకు 24/7 కరెంటు, తాగు నీరు సరఫరా, డ్రైనేజీ, సీసీరోడ్లు, గార్డెన్ తదితర మౌలిక వసతులన్ని కల్పించారు. వీటిలో 2022 ఫిబ్రవరి 3వ తేదీన 200 ఇండ్లను లబ్ధిదారులకు అందించగా, మరో పది గృహాలు ఎవరికీ కేటాయించలేదు. ఈ నేపథ్యంలో కొందరు స్థానికులు అందులోని పది ఇండ్లకు ప్రభుత్వ అధికారులు వేసిన తాళాలను పగులగొట్టి స్వాధీన పర్చుకున్నారు. అందులో డీ–బ్లాకులో తొమ్మిది ఇండ్లు, బీ–బ్లాక్‌లో ఒక ఇంటిని కబ్జా చేసిన సదరు వ్యక్తులు మూడు ఇండ్లలో సామన్లు పెట్టుకోగా, మిగతా వాటిని కిరాయికి ఇచ్చారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ, హౌసింగ్ అధికారులు పోలీసులతో కలిసి ఏకకాలంలో దాడులు చేసి ఆ ఇండ్లను ఖాళీ చేయించారు. అనంతరం తహసీల్దార్ నయీముద్దీన్, హౌసింగ్ ఏఈ మహేశ్, ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ సమక్షంలో పది ఇండ్లకు సీల్ వేశారు. కబ్జా విషయాన్ని సీరియస్‌గా తీసుకుంటున్నామని, ఎలాంటి అలాట్‌మెంట్ లేకుండానే ప్రభుత్వం నిర్మించిన గృహాలను స్వాధీనం చేసుకున్న వారిపై చర్యలు తీసుకుంటామని, ఈ మేరకు కలెక్టర్‌కు నివేదిక పంపించినట్లు తహసీల్దార్ నయీముద్దీన్ తెలిపారు. ఇదిలా ఉండగా, కేటాయించిన 200 గృహాల్లోనూ కొందరు స్థానిక ప్రజాప్రతినిధికి చెందిన వారికి మూడు నుంచి నాలుగు గృహాలు సైతం కేటాయించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వాటిపై కూడా విచారణ జరిపించాలని కోరుతున్నారు.

## నమాత్‌పల్లి మాజీ సర్పంచ్ భర్త మృతి



నర్సయ్య(ఫైల్)

భువనగిరి కలెక్టరేట్, జూలై 24: మండలంలోని నమాత్‌పల్లి మాజీ సర్పంచ్ కంబాలపల్లి లక్ష్మమ్మ భర్త నర్సయ్య(92) అనారోగ్యంతో బుధవారం మృతి చెందా డు. ఆయన అంత్యక్రియలు గురువారం గ్రామంలో నిర్వహించనున్నట్లు కుమారుడు భిక్షపతి తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

యాదగిరిగుట్ట, జూలై24: బైక్ ఢీ కొట్టడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని వంగపల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గ్రామంలోని టాబ్లెట్ కంపెనీలో పనిచేస్తున్న జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన భువనేశ్వర్(40) రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తున్నాడు. అటుగా వంగపల్లికి చెందిన వ్యక్తి బైక్‌పై వెళ్తూ ఢీ కొట్టి పారిపోయాడు. తీవ్రగాయాల పాలైన భువనేశ్వర్ అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రైతులకు బేషరతుగా రైతుల రుణాలు మాఫీ చేయాలి

- **మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ శ్రీధర్**

బొమ్మలరామారం, జూలై 24 : రైతులందరికీ బేషరతుగా రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని భువనగిరి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మన్నె శ్రీధర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని మర్యాల గ్రామంలోని రైతు వేదిక వద్ద బుధవారం నిర్వహించిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు అందరి రుణాలు మాఫీ చేస్తామని చెప్పి, ఇప్పుడు వివిధ కారణాలు చూపుతూ అనేక మందిని అనర్హులుగా చూపడం దారుణమన్నారు. రైతులు బ్యాంక్‌లో తీసుకున్న బంగారు రుణాలను సైతం మాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

## ఆలేరులో సినిమా షూటింగ్



సినిమా షూటింగ్‌లో పాల్గొన్న నటీ, నటులు

ఆలేరురూరల్, జూలై 24 : ఆలేరు మండలంలోని కొల్లూరులో బుధవారం సినిమా షూటింగ్ నిర్వహించారు. మనీష్ గౌర్ హాలివుడ్ ఫిలిమ్స్ సమర్పించు ప్రొడక్షన్ నం–2 చిత్రానికి సంబంధించిన పలు సన్ని వేశాలను చిత్రీకరించారు. ఈ సందర్భంగా సినిమా దర్శకుడు రాము మాట్లాడుతూ ఈ చిత్రం మంచి కుటుంబ కథా చిత్రమన్నారు. ఆలేరు పరిసర ప్రాంతాల్లో పలు సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సినిమా హీరో వేములపల్లి వసంత్‌కుమార్, నటులు మీనా, రమ్య, శీరిష, కోడైరెక్టర్ పోపూరి జ్వాలాసాయి, అసిస్టెంట్ డైరెక్టర్ సంధ్య, సంగీత, కెమెరామన్ నారాయణ, ఎడిటర్ వేణు పాల్గొన్నారు.

## ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శిగా రాజేశ్‌నాయక్



రాజేశ్‌ను అభినందిస్తున్న ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు బెల్లయ్య

తుర్కపల్లి, జూలై 24 : ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శిగా మండలంలోని సంగ్యాతండాకు చెందిన రాజేశ్‌నాయక్‌ను నియమించారు. హైదరాబాద్‌లో బుధవారం నిర్వహించిన సంఘం సమావేశంలో సంఘం జాతీయ అధ్యక్షుడు బెల్లయ్యనాయక్, రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్ నాయక్ అతనికి నియామక పత్రం అందించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

## యథేచ్ఛగా చెరువు మట్టి అక్రమ తవ్వకాలు



చాకలిగిద్ద చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు

యాదగిరిగుట్ట, జూలై24: యాదగిరిగుట్ట పట్టణంలో మట్టి మాఫియా చెలరేగిపోతున్నది. పట్టణంలోని చాకలి గిద్ద చెరువు నుంచి ఇష్టారాజ్యంగా మట్టిని తవ్వి తరలిస్తున్నారు. బుధవారం కొంత మంది జేసీబీ, నాలుగు ట్రాక్టర్లతో మట్టి తవ్వి తరలించినట్లు స్థానికులు తెలిపారు. ఇటుక బట్టీలు, రియల్ ఎస్టేట్ వెంచర్లలో వేసేందుకు చెరువుల్లోని మట్టిని అక్రమంగా తరలించి సొమ్ము చేసుకున్నారు. మట్టిని అక్రమంగా తరలించే వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.